# దొంగ దొరికాడు



కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగుల కోసం ఉచితవైద్య సదుపాయాన్ని కల్పించింది.

దీని ప్రకారం ఉద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే డాక్టర్లవద్ద కన్సల్టేషన్ పొందవచ్చు. ఆయన రాసి యిచ్చిన మందుల్నీ, ఇంజక్షన్లనీ కొనుక్కోవచ్చు. చికిత్స పది రోజులలో పూర్తి చేసుకుని ప్రభుత్వానికి బిల్స్ పెట్టుకోవచ్చు. ఆ బిల్స్ ప్రకారం ప్రభుత్వం డాక్టర్ కన్సల్టేషన్ ఫీజునీ, ఇంజక్షన్ ఛార్జీలనీ, మందుల ఖరీదునీ ఉద్యోగులకి చెల్లిస్తుంది,

ప్రభుత్వ ఉద్యోగులకి చికిత్స చేయడానికి అర్హత ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేసే డాక్టర్లని 'ఆథరయిజ్డ్ మెడికల్ అటెండెంటు' అంటారు.

నిజానికి- ఇది ఉద్యోగులకు ఎంతో గొప్ప సౌకర్యం. వారి పాలిట వరప్రసాదమనే చెప్పాలి.

అయితే... ఇసుక నుంచి కూడా తైలాన్ని పిండగల సామర్థ్యమున్న మనవాళ్ళు- డాక్టర్లతో కుమ్మక్కయి దొంగబిల్స్‌ని పెట్టి బ్రహ్మాండంగా సొమ్ము చేసుకోసాగారు.

అవసరం ఉన్నా, లేకపోయినా ప్రతి బిల్‌లోనూ పూర్తిగా పదిరోజులకీ ఇంజక్షన్లు ఉండాల్సిందే! మూడుకు తక్కువ కాకుండా డాక్టర్ కన్సల్టేషన్ ఉండాల్సిందే! మార్కెట్లో లభించే అతి ఖరీదైన మందుల పేర్లు బిల్స్‌లో చోటు చేసుకోవాల్సిందే! దానాదీనా ప్రతి బిల్ కూడా వంద రూపాయలకు తక్కువ ఉండదు. ఇందులో డాక్టర్‌కి కనీసం ప్రతి బిల్‌కి కనీసం నలభై, యాభై రూపాయలుంటే- ఉద్యోగి వాటా మిగిలిన 50,60 రూపాయలుంటుంది.

అయితే... మందులు కొనకుండా దొంగ బిల్ ఇచ్చినందుకు షాపువారికి బిల్ మొత్తంలో పదిహేనో, ఇరువయ్యో శాతం పోతుంది.

ఈ విధంగా దొంగబిల్లుల వ్యవహారం 'మూడు బిల్లులు, ఆరు వందలు' అన్నట్లు సాగుతుండసాగింది. ఉద్యోగులు పెట్టుండిన బిల్స్ మొత్తం ఏళ్ళు గడుస్తున్నకొద్దీ వేలలో నుంచి లక్షల్లోకి ప్రాకడం మొదలుపెట్టింది.

వస్తున్న బిల్స్‌లో చాలావరకు దొంగ బిల్స్ అని ప్రభుత్వాధికారులకు తెలిసినా, అవన్నీ రూల్సు ప్రకారం పకడ్బందీగా ఉంటుండటంవల్ల వారు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వశాఖల పై అధికారులు ఈ బిల్సుని కూలంకుషంగా దర్యాప్తు చేయవలసిందని తమ క్రింది అధికారులకి రహస్యంగా ఆదేశాలు ఇచ్చారు.

బ్రహ్మానందంగారు కొత్తగా అధికారంలోకి వచ్చిన సూపరిండెంటు.

ఆయన ఐ.పి. యస్. ప్యాసయి, డైరెక్టర్‌గా అధికారంలోకి వచ్చినవాడు. అందువల్ల ఎన్నో ఆశయాలతోనూ, ఆదర్శాలతోనూ రంగంలోకి ఉరకదల్చుకున్నవాడు కావడంతో- ఈ దొంగ బిల్సు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోసాగాడు.

వచ్చిన బిల్సు నన్నింటినీ ఆయన స్వయంగా పరిశీలించడం మొదలుపెట్టాడు. అలా అతి నిశితంగా ప్రతి బిల్లునీ పరిశీలిస్తుండగా... ఆయనకి 'మహమ్మద్ ఖాదర్' పెట్టిన రెండుబిల్సు కనిపించాయి.

అవి రెండూ అతని ఇద్దరు కొడుకుల కోసం! డాక్టర్లు వేరు, తారీఖులు వేరు, పిల్లల పేర్లు వేరు! కానీ, విచిత్రం... ఇద్దరు పిల్లల వయస్సూ ఒక్కటే!

'దొంగ దొరికా' డన్న సంబరంతో పరమానంద పడిపోయాడు బ్రహ్మానందంగారు. ఆ ఆనందంతో సముఖంలో విచారణ జరిపితే ఖాదర్‌ని కంగారుపెట్టి నిజం కక్కించవచ్చని భావించాడు.

వెంటనే మర్నాడు విచారణకి రావలసందిగా ఆదేశాలు జారీచేశాడు ఆయన.

మర్నాడు మహ్మద్ ఖాదర్ విచారణ కోసం వచ్చాడు.

బ్రహ్మానందంగారు విచారణ మొదలుపెట్టాడు.

కోపంగా ముఖంపెట్టి గంభీర స్వరంతో- "ఖాదర్... నీవి దొంగ బిల్స్ అని ఒప్పుకో. నేరం ఒప్పేసుకుంటే శిక్ష తగ్గిస్తాను. బుకాయించడానికి ప్రయత్నించావంటే ఉద్యోగం పోయి జైల్లో కూర్చుంటావు" అని ఆదిలోనే బెదిరించారు.

ఖాదిర్ ఒక్కక్షణం ఆలోచించి, బుర్ర గోక్కుంటూ-

"ఇంతకీ... నావి దొంగ బిల్స్ అని ఎలా అంటున్నారు సార్?" అని అడిగాడు.

"బుకాయించే ప్రతి దొంగా తానెంతో తెలివిగలవాడిననే అనుకుంటాడు. ఎంతటి తెలివిగల దొంగయినా ఏదో చిన్న పొరపాటు చేసి దొరికిపోతాడు. నీవి దొంగ బిల్స్ కాకపోతే ఈ రెండు బిల్స్‌లో ఇద్దరు పిల్లల వయసూ ఒకటే ఎలా అవుతుంది?" అని ఆ బిల్స్ ముందుపెట్టి గర్జించాడు ఆయన.

"అదా... వాళ్ళిద్దరూ కవల పిల్లలు సార్!" అంటూ వస్తున్న నవ్వును బలవంతాన ఆపుకున్నాడు ఖాదిర్.

బ్రహ్మానందంగారి నోరు తెరుచుకున్నది. తెరుచుకున్నట్లే ఉండిపోయింది.

– జయశ్రీ ప్రత్యేక సంచిక... '86

## <u>ఆశ్చర్యం</u>



పరమ త్రాగుబోతైన దేవదాసు చేత ఎలాగైతేనేం... త్రాగుడు మాన్పించాడు డాక్టర్‌గారు. అయితే... మూణ్ణెల్లు అయిందో, లేదో- మళ్లీ త్రాగడం మొదలుపెట్టాడతడు.

అది చూసి అతని మిత్రుడు- "ఏమిటి... మళ్లీ త్రాగుడు మొదలుపెట్టావా?" అని అడిగాడు.

"చెప్పొద్దూ... ఈ మూడు నెలలూ కేవలం అన్నం, నీళ్ల మీద ఎలా బ్రతికానా- అని ఆశ్చర్యంగా ఉందోయ్!" అన్నాడు దేవదాసు.